# పొగ చుట్టిన నిజం

- డా.బి.ఎస్.ఎన్.మూర్తి

అది మా మొదటి రాత్రి.

"నువ్వు చాలా బాగున్నావు" అన్నాను భార్యగా తొలిసారి గదిలోకి అడుగుపెట్టిన మందాకినితో.

ఆమె మొహంలో సంతోషంలేదు. ఇబ్బందిగా మొహం పెట్టి నొసలు చిట్లించింది.

"మీ విమల కన్నానా?" అంది.

గుండెమీద ఒక తాపు తన్నినట్టయింది. నా గుండె మీద ఆమె ప్రేమగా తలవాల్చి కబుర్లు చెబుతుందనుకున్నాను. ఆమె మెడమీదకు జారుతున్న శిరోజాలను సరిదిద్దుతూ జడలో మల్లెపూల వాసన ఆస్వాదిద్దామనుకున్నాను. ప్రణయ మాధుర్యాన్ని ఆమెతో పంచుకోవాలనుకున్నాను.

"నాకన్నీ తెలుసు" అందామె.

ఏమిటి ఆమెకు తెలుసు? నేను చదువుకునే రోజుల్లో విమల నాతో స్నేహంగా ఉండేది. చదువులో ఒకరికొకరు సాయపడుతూ ఉండేవాళ్లం. ఆమెతో సినిమాలకూ, షికార్లకు బరితెగించి తిరగలేదు. సంస్కారయుతంగానే మా స్నేహం సాగింది. ఆమెను పెళ్లి చేసుకుందామనుకున్నాను. మా ఇంట్లో పెద్దలతో చెప్పాను. ఆమె తల్లిదండ్రులతో మాట్లాడడానికి మావాళ్ళు సిద్ధమయ్యారుగానీ విమల నాకు అవకాశం ఇవ్వలేదు. తనకు పెళ్లి నిశ్చయమైందంటూ ఒక శుభలేఖ తెచ్చి నా చేతిలో పెట్టింది. నాకు అర్థమయింది నాతో పరిచయాన్ని కేవలం స్నేహంగానే చూసింది. ఇంట్లో పెద్దలు కుదిర్చిన సంబంధాన్ని ఇష్టపడే చేసుకుంది. పెళ్లయ్యాక భర్త వికాసరావుతో హైదరాబాద్ వెళ్లిపోయింది. ఆమె గురించి నేను ప్రత్యేకంగా ఆలోచిస్తూ కూర్చోలేదు. ఈలోగా ఏవో ఇంటర్వ్యూలకు వెళ్తే ఉద్యోగం దొరికింది. నాకు పెళ్లికూతుర్ని వెదకసాగారు మావాళ్ళు. ఒక పల్లెటూరి సంబంధం వాళ్ళు కబురు చేసారు. వచ్చి పిల్లను చూసుకోమన్నారు. ఆ పిల్లే మందాకిని. పెళ్లిచూపుల్లో నచ్చిందని చెప్పాను. ఆమెతో నాకు పెళ్లయిపోయింది. జరిగిందింతే. నాకు అన్నీ తెలుసు అంటూ మొదటిరోజే నేనో కళంకితమైన చరిత్ర కలవాడిలా నా భార్య మాట్లాడం నాకు నచ్చలేదు. అదంతా వేళాకోళం అని మొదట సరిపెట్టుకున్నాను. ఇది మొదటిరోజు జరగవలసిన పద్ధతిలో జరగనీ అంటూ ఆమెని ఆక్రమించుకున్నాను. శోభనం రాత్రి ప్రకృతి ధర్మం జరిగిపోయింది.

తరువాత పక్కమీద రెండో పక్కకు తిరిగి మాటా మంతీ లేకుండా పడుకున్న ఆమెను మాట్లాడించడానికి ప్రయత్నించాను. నాతో సంభాషణకు ఆమె ఉత్సాహం చూపించలేదు. నాలో అసహనం రాజుకుంది. అలమర సొరుగులో దాచిన సిగరెట్టు పెట్టె తీసాను. కిటికీ దగ్గర నిలబడి ఒకటి తీసి వెలిగించాను. నాకు సిగరెట్లు కాల్చడం ఈమధ్యనే అలవాటయింది. పెళ్లి అవగానే మానేద్దామనుకున్నాను. కానీ జీవిత భాగస్వామి ప్రక్కనే ఉండి కూడా ఏకాంతం భరించలేక ముట్టించాను.

ఆ రాత్రి ఏవో ఆలోచనలతో మంచంమీద అటూ ఇటూ దొర్లాను. భార్య ఆదమరచి నిద్రపోతోంది. ఆమెను లేపే సాహసం చేయలేదు. నాకు ఎప్పటికో నిద్ర పట్టింది.

★★★

తెల్లవారాక మందాకిని అంది "మీకు సిగరెట్లు అలవాటు కూడా ఉందన్నమాట"

అంటే ఇంకేవో దురలవాట్లతో ఆమె దృష్టిలో నేనో చెడ్డవాడినన్న ముద్ర అప్పటికే పడిందని అర్థమయింది.

"నీకు ఇష్టం లేకపోతే కాల్చను" అన్నాను అనునయంగా.

ఆమె ఒక్కక్షణం మాట్లాడలేదు. మళ్లీ అసహనంగా అంది "మీకు ఇష్టం వచ్చినన్ని తాగండి"

"తాగడానికి ఇదేమైనా టీయా? కాఫీయా? సిగరెట్లు కాలుస్తారు. తాగరు" అన్నాను.

"నాకు తెలుసు" అంది విసురుగా ఓ పది హత్యలు చేసిన వాడిని చూసినట్లు నన్ను అసహ్యంగా చూసింది.

ఒకప్పుడు విమలను వివాహం చేసుకుందామన్న నా అభిప్రాయాన్ని విమల వేరే సంబంధం చేసుకోవడం, ఈ విషయంలో నా భార్య పెళ్లిలో తోటి ఆడవాళ్ళు చెబితే తెలుసుకుంది. పెళ్లికి ముందు మరో స్త్రీ మీద అలాంటి అభిప్రాయం నాకు కలగడం ఆమె సహించలేకపోతోంది. ఆమె దృష్టిలో నా శీలం కళంకితమైపోయింది. అందుకే నా సిగరెట్లు అలవాటు మీద ఆమె దాడి.

నా సంసార జీవితం అసంతృప్తితో మొదలయింది.

నేను ఉద్యోగం చేస్తున్నది విజయనగరంలో.

పెళ్లి హడావుడి గడిచాక ఆ ఊళ్లోనే ఒక ఇల్లు తీసుకుని కాపురం పెట్టాను.

బాగా ప్రేమించుకునే భార్యాభర్తలు ఎలా పరాచికాలు ఆడుకుంటారో, ఎలా ప్రణయ సంభాషణలు దొర్లించుకుంటారో నా భార్య టీవీల్లోనూ, సినిమాల్లోనూ చూసే వుంటుంది. కానీ తను నాతో అలా ఉండదు. అంతా గాంభీర్యం. మా దాంపత్యం నిశ్శబ్ద యాంత్రిక జీవనమయింది. ఈ నిశ్శబ్దంలో సిగరెట్టే నాకు తోడుండే వస్తువయింది. ఆమె అనవసరపు ఆరాటంతో నన్ను ఇబ్బందులకు గురిచేయడం ఎన్నిసార్లో జరిగింది.

నేను ఒక అడ్వర్‌టైజింగ్ ఏజెన్సీలో పనిచేస్తున్నాను. ఒకసారి సెలవు రోజున నేను ఇంట్లో ఉండగా ఆఫీసు స్టెనో వచ్చింది. మర్యాదకోసం ఆమెకు కాఫీ ఇవ్వమని నా భార్యతో చెప్పాను. ఆమె అయిష్టంగానే కాఫీ తెచ్చి ఇచ్చింది. ఆ స్టెనోతో ఒక్క మాట కూడా మాట్లాడలేదు. మూతి ముడుచుకుంటూ లోపలికి వెళ్లింది. ఆమెను వింతగా చూసిన స్టెనో నాతో పేపరుకివ్వవలసిన ఎడ్వర్‌టైజ్‌మెంట్ గురించి మాట్లాడి వెళ్లింది. అంతే ఆ రోజంతా మందాకిని నాతో మాట్లాడలేదు.


మరో నాలుగురోజులు పొడి పొడి మాటలే. కాఫీ చేసి పట్టుకొస్తే నా చేతికివ్వడం మానేసి ఎదురుగా వున్న బల్లమీద చిన్న చప్పుడుతో పెట్టేది. వంట చేసి వడ్డించాక నేను తినేదాకా మాట్లాడకుండా కూర్చోవడం, చిరాకుగా చూడడం చేసేది. రాత్రి అసలు మాటా మంతీ లేకుండా నిశ్శబ్దంగా అటు తిరిగి పడుకునేది. ఆమె మొహంలో జరగరాని తప్పేదో జరిగిపోయినట్లు ఫీలింగు. ఈ నిశ్శబ్దాన్ని

భరించలేక సిగరెట్లు ముట్టించుకునేవాడిని.

ఇంట్లో పనిమనిషిగా ఒకామె చేరింది. ఆమె వయసు పదహారేళ్ళు. వయసులో వున్న పిల్ల. నేను మగాడ్ని. నా భార్య కంగారు వేరే చెప్పక్కర్లేదు. పని పిల్ల వచ్చి పని చేసి ఇంటికి తిరిగి వెళ్లేంతవరకూ నన్నూ, ఆమెనూ ఒక కంట కనిపెడుతూ ఉండేది. కాపురం చేసే దంపతుల మధ్య నమ్మకం, అవగాహనా ముఖ్యం. అవి ఏర్పడడానికి మాకు పరిస్థితులు దోహదం చేయడంలేదు. నెలరోజులు తిరక్కుండానే ఆమె పనిమనిషిని మార్చేసి పనికి మరో పెద్దావిడను ఎంపిక చేసి పెట్టుకుంది.

ఒకసారి మా అత్తగారికి బాగోలేకపోతే మందాకిని పుట్టింటికి వెళ్లింది. తల్లి ఆరోగ్యం కుదుటపడ్డాక అయిదురోజుల తరువాత తిరిగి వచ్చింది.

"నువ్వు లేకపోతే ఎంత ఇబ్బంది పడ్డానో తెలుసా?" అన్నాను. ప్రేమ గుప్పించానన్నమాట.



ఆమె నిర్లక్ష్యపు ధోరణితో అంది "హాయిగా ఎవరితోనో కులుకుతూ గడిపి ఉంటారు. నాకు తెలుసు" అంత తేలిగ్గా. అనేసిన ఆమె మాటలు నా గుండెకు ఈటెల్లా తాకాయి. నా చెయ్యి జేబులోని సిగరెట్టు పాకెట్టు మీదకి వెళ్లింది. గుండె నిండా పొగ పీల్చి వదిలాను. దగ్గు తెర వచ్చింది. సిగరెట్టు పొగలో నా భార్య మొహం అస్పష్టంగా కనిపించింది. నేను సిగరెట్లు తెగ కాలుస్తూ వుంటే ఆమెకు ఏ కోశానా బాధ వున్నట్లులేదు. నా ఆరోగ్యం గురించి ఆందోళన లేదు. తన మాటల ద్వారా, ప్రవర్తన ద్వారా, నన్ను మనస్తాపానికి గురి చేస్తే లభించే సంతృప్తి ఆమెకు విజయం. నా మానసిక బలహీనత కూడా ఈ అలవాటుకు బానిస అవడానికి కొంతవరకు కారణం. నా బాధ అంతా చెడిపోతే నేనే చెడిపోతాను అన్న ధోరణిలో నా భార్య ఉండడం. నేను ఆమెకు భర్తను కానా?

ఇంటికి ఒకరోజు చుట్టాలు వచ్చారు. వాళ్లల్లో యుక్త వయసులో వున్న ఒకామె వుంది. నాకు మరదలు అవుతుంది. పేరు కోకిల. ఒక సందర్భంలో వారంతా ఇంట్లో పరాచికాలు ఆడుకుంటున్నారు. మాటలు జాతకాలమీదకు మళ్లాయి. అరచేతిలో రేఖలు చూసుకుంటూ భవిష్యత్తు విశ్లేషించుకుంటున్నారు. అదే సమయానికి నేను అక్కడికి వెళ్లాను. కోకిల నన్ను చూసి అంది "ఏది బావా నీ చెయ్యి. జాతకం చెబుతాను"

నా చెయి చాపాను.

ఆమె నా అరచేతిని పట్టుకుని రేఖలు చూస్తూ భవిష్యత్తు చెప్పసాగింది. ఇది మందాకినికి నచ్చలేదు. కోపం వచ్చింది. ఆ సమయానికి ఆమె చేతిలో వంట పాత్ర ఒకటి వుంది. కోపంగా దాన్ని కోకిలమీదకు విసిరింది.

"అడ్డమైనవాళ్లకు ఇలా చేతులు ఇచ్చి జాతకాలు చూపించుకునేందుకు సిగ్గులేదూ?" అంది.

ఆ మాటలు నన్ను ఉద్దేశించి అన్నవే. తరువాత ఆమె విసురుగా వంటింట్లోకి వెళ్లిపోయింది.

నాలో అసహనం పెరిగిపోయింది. నేనూ ఏదో నోరు చేసుకోబోయాను. కానీ సంస్కారం అడ్డు వచ్చింది. అసహనాన్ని అణచివేసేందుకు సిగరెట్టుని ఆశ్రయించాను. నాలుగురోజులు ఉందామని వచ్చిన బంధువులు మర్నాడే వెళ్లిపోయారు.

★★★

మరోసారి నా మిత్రుడు గుర్నాథం పెళ్లాం రాజీతోసహా వచ్చి మా ఇంట్లో దిగాడు. రాజీ వచ్చి వాగుడుకాయ. భర్తమీద జోకులు వేస్తూ తెగ నవ్వుతుంది. గుర్నాథం సమాధానం చిరునవ్వే. ఆమె అలా విరామం లేకుండా మాట్లాడుతుంటే ఆసక్తిగా వింటున్నాను. ఆ సమయానికి మేము ద్వారం దగ్గర వున్నాము. ఇంతలో మందాకిని వచ్చింది.

"మీరిద్దరూ ఆ గుసగుసలు మాని అడ్డు లేస్తే అవతలి గదిలోకి వెళ్లాలి" కసిగా అంది.

అక్కడే ఉన్న గుర్నాథం ఆమె మాటలకు నివ్వెరపోయాడు. అంత గట్టిగా మేము మాట్లాడుతుంటే గుసగుసలు అంటుందేమిటి? నేనూ, రాజీ ఏదో తప్పు చేస్తున్నట్లు. మేము దారి ఇస్తే మందాకిని మమ్మల్ని దాటి వెళ్లిపోయింది.గుర్నాథం ఏమనుకున్నాడోగానీ ఆ సాయంత్రమే భార్యతోసహా మా ఇంట్లో నుండి బయలుదేరి వెళ్లిపోయాడు. ఆ రాత్రి నా కోపం తారాస్థాయికి చేరుకుంది. మందాకినితో అన్నాను-

"నాకు తారసపడ్డ ప్రతి స్త్రీతో అక్రమ సంబంధాన్ని ముడివేసి చూస్తావెందుకు? వాళ్ళూ నీలాంటి ఆడవాళ్లే కదా. వాళ్లనిలా అవమానపరిస్తే నీకేమిటి లాభం? ఎందుకు నన్నిలా హింసిస్తావు?"

ఆమె ఏమీ మాట్లాడలేదు. మౌనమే సమాధానం. 'తప్పయిపోయింది. క్షమించు' అన్నా నాకు కొంత ఊరట కలిగేది.



కానీ అహంకారపు పొగలు కప్పేసిన ఆమె దృష్టిలో తాను అసలు ఏ తప్పు చేయని జీవి. తన తప్పు ఒప్పుకోదు. నేను పెళ్లి చేసుకుని నా జీవితంలోకి తీసుకువచ్చింది భార్యనా? లేక కాపలా కుక్కనా?

"నీకు నన్ను గమనించడంతప్ప మరే విషయాల పట్ల ఆసక్తి ఉండదా? నీకంటూ సొంత జీవితం ఏమీ ఉండదా?" అని అడిగాను.

ఆమె దగ్గర సమాధానం లేదు. అసహనంతో రెండు సిగరెట్లు ముట్టించాను. అవి కాలుస్తున్నప్పుడు కాలుస్తున్నానన్న తృప్తికన్నా నా భార్యను ఎదుర్కొంటున్నానన్న భావనే ఎక్కువ కలుగుతోంది. ఇలా మా జీవిత చదరంగంలో సిగరెట్టుదో పెద్ద పాత్ర అయిపోయింది.

***

రోజులు గడుస్తున్నాయి.

ఒకసారి నాకు విపరీతంగా దగ్గుతెర వచ్చింది. దాంతో జ్వరం, నీరసం. కళ్ళు తిరిగి పడిపోయేంత అలసట. నా కొలీగ్స్ నన్ను హాస్పిటల్‌లో చేర్చారు. డాక్టర్లు టెస్టులు చేసి 'న్యూమోనియా' అన్నారు. ట్రీట్‌మెంట్ ఇస్తే అయిదురోజుల్లో తగ్గింది. డిశ్చార్జి చేసే ముందు డాక్టర్లు వార్నింగ్ ఇచ్చారు సిగరెట్లు మానేయమని. లేకపోతే ప్రాణం మీదకు వస్తుందని.

ఆ మాటలు విన్న నా భార్య కంట తడి పెట్టడం నేను గమనించాను. అది చూసి నా మనసు కరిగిపోలేదు. ఆమెను సాధించగలిగానన్న తృప్తి గుండెల నిండా నిండింది. ఇంటికి తిరిగి వచ్చాను. కానీ నా మనసు నియంత్రించుకోలేక పోయాను. మళ్లీ సిగరెట్టు ముట్టించాను. నా భార్య వారించబోయింది. నాకు తెలుసు. ఆమెకు కావలసింది నేను కాదు, తన మెళ్లో మాంగల్యం.

"అలా వారించే హక్కు నీకు లేదు" అన్నాను.

మా ఇద్దరి మధ్యా అంగుళాల్లో ఉండే దూరం అడుగులయింది. అడుగులు కిలోమీటర్లయ్యాయి. మధ్యలో అంతా పొగే. స్పష్టతలేదు.

నేను అప్పుడప్పుడూ ఆలోచిస్తూ ఉండేవాడిని. పెళ్లయ్యాక భార్య అందించే రసమయ జీవితంలో పరవశిస్తూ ఈ సిగరెట్టుని దూరం చేసుకుందామనుకున్నాను. కానీ పెళ్లయ్యాక ఈ అలవాటు మరీ ఉధృతమయింది. ముట్టిస్తే కదిలే ప్రాణం పొగ, గదంతా నిండుతుంది. గుండె నిండా ఆవరించుకుంటుంది.

***

నేను హాస్పిటల్‌లో చేరినట్లు, బయటపడినట్లు ఆ నోటా ఈ నోటా ప్రాకి హైదరాబాద్‌లో వున్న విమలకు తెలిసింది. ఒకరోజు భర్త వికాసరావుతో సహా నన్ను చూడడానికి వస్తున్నట్లు ఫోన్ చేసింది. అన్నట్లే వచ్చింది.

విమలా, వికాసరావులు చాలా ఆప్యాయంగా నాతో చాలా విషయాలు మాట్లాడారు. వారి అన్యోన్యత చూస్తే ముచ్చటేసింది. తర్వాత వికాసరావు అన్నాడు "నేను బరంపురం వారంరోజులు ట్రెనింగ్‌కు వెళ్లాలి. ఈ వారంరోజులూ విమల మీ ఇంట్లోనే వుంటుంది. మీకేం అభ్యంతరం ఉండదు కదా"

"ఏం ఉండదు. మీ దంపతుల్లో ఎవరికైనా ఆతిథ్యం ఇవ్వడంకన్నా సంతోష మేముంది?" అన్నాను నేను.

నా భార్య ముఖంలో కవళికలను గమనించాను. ఏ స్త్రీని నేను ప్రేమించానని నన్ను సాధిస్తోందో ఆ స్త్రీయే కొన్నాళ్లు మా ఇంట్లో ఉండబోతోంది. ఆమెలో ఆరాటం సహజంగానే ఎక్కువగానే వుంటుంది. వాళ్లముందు మర్యాదకు ఇష్టమున్నట్లే నటించింది.

వంటింట్లో మేమిద్దరమే వున్నప్పుడు నాతో అంది "ఆయన భార్యను ఉంచడానికి మనిల్లే దొరికిందా? ఊర్లో ఇంకెవరూ స్నేహితులు లేరా?"

"విమల ఈ ఊరు రావడానికి కారణం కేవలం నన్ను చూడడానికే. మరొకరి ఇంట్లో ఎందుకుంటుంది? ఆమె భర్తకు ఆమెమీద ఏ అపనమ్మకమూలేదు. మరి నీకు నామీద ఈ విపరీత ధోరణి ఎందుకో నాకు అర్థం కావడంలేదు"

"బాగుంది. ఇలాంటి విషయాల్లో సలహాలివ్వడానికి నేనెవర్తిని?" అంటూ ఏదో పని వున్నదానిలా అక్కడినుండి వెళ్లింది.

రెండు మూడు రోజులు గడిచాయి. విమల ఎంత కలుపుగోలుతనంగా మాట్లాడినా నా భార్య ముఖంలో అశాంతి కనిపిస్తూనే వుంది.

***

మూడోరోజు ఉదయం నేను టీ త్రాగి పేపరు చదువుకుంటూ వరండాలో కూర్చున్నాను. విమల నా దగ్గరకొచ్చి కుర్చీ లాక్కొని ఎదురుగా కూర్చుంది.

"నువ్వు ఎందుకలా సిగరెట్లు కాలుస్తావు? డాక్టర్లు మానేయమని చెప్పారుట?" అంది.

"నాకూ మానేయాలనే ఉంది. కానీ మానలేను" అన్నాను.

"ఎందుకు మానలేవు?"

నేను సమాధానం చెప్పలేదు.

ఆమె నెమ్మదిగా అంది "నువ్వీ అలవాటు మానేస్తే నేనెంతో సంతోషిస్తాను తెలుసా?"

## పళ్ల గురించి నిజాలు

★ పళ్ల గట్టితనానికీ, వయస్సు పైబడడానికి సంబంధంలేదు. వాటినెంత పరిశుభ్రంగా ఉంచుకున్నారన్నదే ముఖ్యం.

★ ఏ టూత్‌పేస్ట్ వాడారన్నది ప్రధానం కాదు. బ్రష్ ఎలా చేసుకుంటున్నారన్నది ముఖ్యం.

★ ప్రొద్దున్న పళ్లు తోముకోవడంకన్నా ముఖ్యమైనది రాత్రి నిద్రపోయే ముందు పళ్లు పరిశుభ్రం చేసుకోవడం.

★ పిల్లలచేత ఎంత చిన్న వయసులో పళ్లు తోముకునే అలవాటు చేస్తే అంత మంచిది.


★ పొగాకు నమిలిన వాళ్లకే కాదు, సిగరెట్లు కాల్చే వాళ్ల పళ్లు కూడా పాడవుతాయి.

★ ప్రపంచంలో పొగాకు ఎక్కువగా పండించేది మన దేశమే. ఎక్కువ పొగాకు వాడేది, నోటి కేన్సర్లు ఎక్కువగా వున్నదీ మన దేశంలోనే.

★ నోటి కేన్సర్ గురించి ప్రపంచవ్యాప్తంగా చాటిన తరువాత పొగాకు వాడకం తగ్గడం గమనార్హం. ఫిన్లాండ్‌లో గత సంవత్సరం 22 ఓరల్ కేన్సర్ కేసులు మాత్రమే వచ్చాయి.

★ ఆశ్చర్యంగా దేశ రాజధాని ఢిల్లీలో కూడా గత ఐదు సంవత్సరాలలో సిగరెట్లు వాడకం తగ్గిపోయింది. పాండిచ్చేరిలో సగానికి సగం తగ్గిపోయింది.

-విమలారామం



"అయితే ప్రయత్నిస్తాను" అన్నాను.

"ప్రయత్నించు. తప్పకుండా మానేయగలవు"

నా జీవితంలో మరో ప్రాణికి సంతోషాన్నిచ్చే పని నేనేమైనా చేయగలిగితే అంతకన్నా తృప్తి మరొకటి ఏముంటుంది? ఒక్కక్షణం ఊపిరి బిగబట్టాను. నిర్ణయం తీసుకున్నాను.

"అయితే మానేస్తాను" అన్నాను.

"నిజంగా?"

"నిజంగానే" అన్నాను.

ఆ రోజు మరి సిగరెట్టు ముట్టలేదు.

మర్నాడు మనసులో బలమైన కోరిక సిగరెట్ కాల్చాలని. గుండెనిండా దిగులు, వళ్లంతా నిస్సత్తువగా వుండేది. చికాకు ఎక్కువయింది. కానీ విమలకు మాటిచ్చాను. మాట నిలుపుకోవాలి.

***

మరో వారం గడిచింది. ఈ వారంలో సిగరెట్టు మీద ధ్యాస క్రమంగా తగ్గిపోయింది. నేనీ అలవాటుమీద విజయం సాధించాను. ఇక జీవితమంతా ఈ అలవాటుకు దూరంగా ఉండగలనన్న నమ్మకం కలిగింది. ఇది విమల నాకందించిన విజయం. ఇదే కోరిక నా భార్య కోరి వుంటే నేనెప్పుడో ఆమె కోరికను మన్నించేవాడిని. ఈలోగా బరంపురం నుండి వికాసరావు తిరిగి వచ్చాడు. అక్కడి వింతలు విశేషాలు చాలా చెప్పాడు. మాకు కొన్ని కానుకలు తెచ్చాడు కూడా. ఆ సాయంత్రమే హైదరాబాద్ తిరుగు ప్రయాణం అన్నాడు.

మధ్యాహ్నం భోజనాలయ్యాక విమల భర్తతో కలసి తిరిగి వెళ్లిపోవడానికి సిద్ధమయింది. నా భార్య ముఖంలో ఆశ్చర్యం. విమల ఇలా వచ్చింది, అలా వెళ్లిపోతోంది. నాచేత నా ఆరోగ్యాన్నికి సరిపడని ఒక దురలవాటుని పనిగట్టుకు మరీ మాన్పించింది. ఆమె ఆప్యాయంగా విమల చేయి పట్టుకుంది.

ఈలోగా విమల నాతో "నేను వెళ్లేముందు నీతో కొన్ని విషయాలు మాట్లాడాలి" అంది. ఆ ఇద్దరినీ ఆ గదిలో వదిలి నా భార్యా, వికాసరావు పక్క గదిలోకి వెళ్లారు.

విమల అంది "ఇక్కడి విషయాలు చూసాను. మీ భార్యాభర్తలిద్దరి మధ్య కనిపించని ఎడబాటు గమనించాను. మనిషన్న తరువాత కొన్ని బలహీనతలు ఉంటాయి. వాటిని అధిగమించి పరిస్థితులు చక్కదిద్దుకునే చొరవ, విజ్ఞతా, ధైర్యం ఉండాలి"

"ఎవరి గురించి నువ్వు మాట్లాడుతున్నావు?" అన్నాను.

"నీ గురించే. నీ భార్య మందాకిని ఆధునిక సంప్రదాయాల నుండి వచ్చిన పిల్లకాదు. ప్రపంచాన్ని పెద్దగా చూడలేదు. నీ భార్యగా కొత్త జీవితాన్ని ప్రారంభించింది. నీతోటే తన జీవితం, తన ప్రపంచం అని విశ్వసించింది. ఈ వయసులో మాలాంటి స్త్రీలకు మా అందం మీద నమ్మకం, దాంతోపాటే కొంత అహం ఉండటం సహజం. దాన్ని నువ్వు గర్వంగా భావించి పొరపాటు పడ్డావు. నీ నుండి ఆమెకు కావాల్సింది రక్షణ. దాన్ని కల్పించడం మాని నువ్వే డిప్రెషన్‌కు లోనై బాధ్యతల్ని మరిచావు"

"నేను బాధ్యతల్ని మరిచానా?" అన్నాను.

"అవును. కొత్తగా పెళ్లయిన దంపతులు మీరు. కాపురం చేసిన ఈ కొద్దిరోజుల్లో ఏనాడైనా ఆమెకో మల్లెపూల దండ కొనిచ్చావా? సరదాగా సాయంత్రం ఏ సినిమాకో, షికారుకో తీసుకువెళ్లావా? ఆమె మౌనంలో ఇలాంటి కోర్కెలు దాగున్నాయని అర్థం చేసుకున్నావా? ఆమెలో ఏ అపోహలు తలెత్తకుండా నువ్వు తన సొంతం అన్న నమ్మకం కలిగించావా? ఆమెను సాధించడమే లక్ష్యంగా పెట్టుకుని బ్రతికేస్తున్నావు తప్ప ఆమెలో ఉత్సాహము, మార్పు తెద్దామని ప్రయత్నించావా?"

ఆమె అడిగిన ప్రశ్నలకు సమాధానం నా దగ్గర లేదు.

"నీ భార్యతో అన్ని విషయాలు చర్చించాను. నీతో సరికొత్త జీవితం గడపడానికి ఆమె సిద్ధంగావుంది. ఇంకా సాగించవలసిన జీవితమంతా ముందే వుంది. భవిష్యత్తు సమస్యల వలయం చేసుకోకు. వీణ తప్పుగా మీటితే అపస్వరమే వినిపిస్తుంది. సరిగ్గా మీటితే మధురమైన సంగీతాన్ని ఇస్తుంది. మీ ఇద్దరి మధ్యా ఇన్నాళ్లూ పేరుకుపోయిన నిశ్శబ్దంలో నుండి సప్తస్వరాల సంగీత రావం పుట్టాలి. మనసుల కలయికతో మృదంగ నాదం వినిపించాలి. నేను చెప్పేదింతే" అందామె.

విమల మాటల్లోని సత్యం అర్థమయింది.

తలుపు చప్పుడయింది. మందాకిని గది లోపలికి పళ్లరసం పట్టుకుని వచ్చింది. మా ఇద్దరికీ చెరో గ్లాసు అందించింది. నేనా గ్లాసు అందుకుంటూ ఆమె మొహంలోకి చూసాను. ఆమె తలుపు చాటు నుండి మా మాటలు విన్నట్టుంది. ఆమె మొహంలో ఎన్నో భావాలు... కొత్తవి, అందంగా కనిపిస్తున్నాయి. అవును ఆమె నా భార్య.

★

## చాలా బాగుంది



'ముంబై ఎక్స్‌ప్రెస్' హీరోయిన్ మనీషా కొయిరాలా తన అందంతో అందర్నీ ఆకట్టుకుంటోంది. రోజురోజుకీ సినిమాలలో హీరోయిన్ల ఎక్స్‌పోజింగ్ ఎక్కువైపోతుంటే మనీషా మాత్రం 'ముంబై ఎక్స్‌ప్రెస్'లో చక్కటి చీరలో సంప్రదాయానికి ప్రతీకగా కన్పించడం చిత్ర పరిశ్రమలో చర్చనీయాంశం అయింది. 'ఈ సినిమాలో నా పాత్ర సంప్రదాయాన్ని ప్రతిబింబించేదిగా ఉంటుంది. అందుకే చక్కటి చీరలో కన్పిస్తాను. ఇలా కన్పించడం నాకెంతో బాగుంది' అంది మనీషా.

